

కోదాడలోని పెన్షనర్స్ భవన్‌లో ఎమ్మెల్యే పద్మావతికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న విశ్రాంత ఉద్యోగులు

## విశ్రాంత ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

● కోదాడ ఎమ్మెల్యే పద్మావతీఉత్తమ్‌కుమార్‌రెడ్డి

కోదాడ, జనవరి 10 : విశ్రాంత ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే పద్మావతీఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. కోదాడ ఎమ్మెల్యేగా ఎన్నికయ్యాక బుధవారం పట్టణంలోని స్థానిక పెన్షనర్స్ భవన్‌లో జరిగిన పెన్షనర్స్ సమావేశానికి హాజరైన సందర్భంగా ఆమె మాట్లాడారు. ఎన్నికల ప్రచారంలో పెన్షనర్లకు ఇచ్చిన హామీలను అమలు చేస్తామన్నారు. కోదాడలో సీనియర్ సిటిజన్స్‌కు వృద్ధాశ్రమం ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రావెళ్ల సీతారామయ్య పెన్షనర్ల సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కోదాడ యూనిట్ అసోసియేట్ ప్రెసిడెంట్ మల్లెంపల్లి వెంకటేశ్వర్‌రావు, చింతకుంట్ల లక్ష్మీనారాయణరెడ్డి, ముత్తవరపు పాండురంగారావు, వంగవీటి రామారావు, పార సీతయ్య, కౌన్సిలర్ ప్రసన్నలక్ష్మీ కోటిరెడ్డి, లక్ష్మీనర్సయ్య, సుదర్శన్‌రెడ్డి, బొల్లు రాంబాబు, విద్యాసాగర్, వరప్రసాద రావు, హమీద్‌ఖాన్ పాల్గొన్నారు.

### కోదాడను తీర్చిదిద్దుతా

కోదాడ రూరల్ : రాష్ట్ర ముఖద్వారం అయిన కోదాడ పట్టణాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతానని ఎమ్మెలేయ నలమాద పద్మావతీఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. బుధవారం మాతృభూమి ఐక్యవేదిక సభ్యులు పట్టణ సుందరీకరణపై క్యాంపు కార్యాలయంలో ఇచ్చిన వినతిపత్రాన్ని స్వీకరించి మాట్లాడారు. కార్యక్రమంలో వేదిక అధ్యక్షుడు డాక్టర్ జాస్తి సుబ్బారావు, డాక్టర్ రామారావు, సురేంద్ర బాబు, నాదెళ్ల బాలకృష్ణ, కేశవరావు, సోమిరెడ్డి, రాజశేఖర్, శ్రీదేవి, కిరణ్, మేళ్లచేర్వు కోటేశ్వర్‌రావు, నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.

## సంక్రాంతికి ఊరెళ్తే భద్రతా చర్యలు పాటించాలి : ఎస్పీ

సూర్యాపేట సిటీ, జనవరి 10 : సంక్రాంతికి సొంత ఊర్లకు వెళ్లేవారు భద్రతా చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పండుగ దృష్ట్యా చోరీలు జరుగకుండా నియంత్రణ చర్యలు చేపట్టామని, ఈ విషయంలో జిల్లా ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్పీ పేర్కొన్నారు. దూర ప్రాంతాలకు వెళ్లేవారు తమ ఇంటి చిరునామా, ఫోన్ నంబర్‌ను సంబంధిత పోలీస్‌స్టేషన్ అధికారులకు తెలిపితే వారి ఇండ్లపై నిఘా ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ప్రజలు తమ కాలనీలు, ఇండ్లు, పరిసరాలు, షాపింగ్ మాల్స్‌లో సీసీ కెమెరాలు అమర్చుకోవాలని సూచించారు. ఊరెళ్తున్నప్పుడు పక్కింటివాళ్లకు చెప్పాలని, విలువైన వస్తువులను ఇంట్లో ఉంచవద్దని, వ్యక్తిగత ఆర్థిక విషయాలను ఇతరులకు చెప్పవద్దని తెలిపారు. ఇంటికి తాళం వేసిన తరువాత తాళం కనపడకుండా డోర్ కర్టెన్ వేయాలని, ఇంట్లోని ఏదో ఒక గదిలో లైట్ వేసి ఉంచాలని పేర్కొన్నారు. అనుమానాస్పద వ్యక్తుల కదలికలను గమనించి100, కంట్రోల్ రూమ్ 8712686026 నంబర్లకు సమాచారం ఇవ్వాలని సూచించారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి నాగార్జున్‌రెడ్డి

## 19న కార్మిక కర్షక జిల్లా సదస్సు

● సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున్‌రెడ్డి

బొడ్రాయిబజార్, జనవరి 10 : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు, కార్మిక, వ్యవసాయ కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా జనవరి, ఫిబ్రవరి మాసాల్లో జరిగే ఆందోళనల విజయవంతం కోసం ఈ నెల 19న సూర్యాపేటలో నిర్వహించే కార్మిక కర్షక జిల్లా సదస్సును విజయవంతం చేయాలని రైతు సంఘం రాష్ట్ర నాయకుడు మల్లు నాగార్జున్‌రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక ఎంవీఎన్ భవన్‌లో ఏర్పాటు చేసిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలకు అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన బీజేపీ గత పదేండ్లలో అనుసరించిన విధానాల మూలంగా దేశం దివాలా తీసిందని ఆరోపించారు. ప్రజల సంపదను అంబానీ, ఆదానీ వంటి కార్పొరేట్ శక్తులకు అప్పణంగా కట్టబెట్టిందన్నారు. బీజేపీ రైతు, కార్మిక వ్యవసాయ కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా జనవరి 26న జరిగే ట్రాక్టర ర్యాలీని విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి వెంకటేశ్, ప్రజా సంఘాల నాయకులు నెమ్మాది వెంకటేశ్వర్లు, మట్టిపల్లి సైదులు, దండ వెంకట్‌రెడ్డి, ముల్కలపల్లి రాములు, కొప్పుల రజిత, చెరుకు ఏకలక్ష్మి, పులుసు సత్యం, కంబాల శంకర్, వజ్జ శ్రీనివాస్, కోటగిరి వెంకట్‌నారాయణ, బుర్ర శ్రీనివాస్, వట్టెపు సైదులు, ముత్యాలు, సాయికుమర్, కృష్ణ, శ్రీను పాల్గొన్నారు.

## అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

కోదాడ రూరల్, జనవరి 10 : మహిళ అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన సంఘటన బుధవారం కోదాడ పట్టణ పరిధిలో జరిగింది. స్థానికులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణ పరిధిలోని గోపిరెడ్డినగర్‌కు చెందిన రమావత్ రాజు, దుర్గాబాయి(30)దంపతులు కొంతకాలంగా పట్టణంలోని పాత పోస్టాఫీస్ సమీపంలో డ్రస్ మెటీరియల్ షాపు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో బుధవారం ఆమె షాపులో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ఆమెకు కూతురు, కుమారుడు ఉన్నారు. మృతురాలి తండ్రి ధరావత్ భవాసింగ్ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకున్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
NAMASTHE TELANGANA CLASSIFIEDS

FLAT FOR SALE
★ HAYATHNAGAR: Walkable Distance, Vijayawada Highway, Beside Bus Stop, Sup. Luxurious 3 BHK Flats, Ready to move, 2 side 30' Rd. Ph: 9247326642 / 9849801477.
NT-314488

ఉద్యోగ అవకాశము
ప్రముఖ కంపెనీలో ఫుల్ టైం పార్ట్ టైం జాబ్స్ అవకాశం అర్హత 10th to డిగ్రీ & MBA. B.Tec. హౌస్ వైఫ్స్, ఎంప్లాయిస్ (ఎటువంటి ఫీజ్ లేదు) సంప్ర:6281817942.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

NLG-

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం... మన "నమస్తే తెలంగాణ" క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం...
ప్రతి 4 లైన్ల క్లాసిఫైడ్‌కు 200/-
ప్రతి అదనపు లైన్‌కు 50/-
Note: 3+1 Scheme Available
Minimum 4 Lines, Extra Line - Extra Amount
నమస్తే తెలంగాణ యూనిట్ కార్యాలయం, గ్రా॥ చర్లపల్లి, మం॥ నల్లగొండ.
నల్లగొండ : 9182777626 | నల్లగొండ : 9182777635 | దేవరకొండ : 9182777635
హాలియా : 9182777059 | సూర్యాపేట : 9182777630 | భువనగిరి : 9182777638
మిర్యాలగూడ : 9182777059 | కోదాడ : 9182777196 | చౌటుప్పల్ : 9182777638

# ముమ్మరంగా డేటా ఎంట్రీ ప్రక్రియ



మఠంపల్లి : ఎంపీడీఓ కార్యాలయంలో దరకాస్తులను ఆన్‌లైన్ చేస్తున్న సిబ్బంది

మఠంపల్లి, జనవరి 10 : ప్రజాపాలన దరఖాస్తుల డేటా ఎంట్రీ ముమ్మరంగా కొనసాగుతున్నది. బుధవారం మండల కేంద్రంలోని తాసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాల్లో ఆన్‌లైన్ ప్రక్రియను తాసీల్దార్ మంగా రాథోడ్, ఎంపీడీఓ జానకిరాములు, ఎంపీఓ ఆంజనేయులు వేర్వేరుగా పరిశీలించి అధికారులు, ఆపరేటర్లకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో 15,143 దరఖాస్తులు వచ్చాయని, ఇప్పటి వరకు 13వేల దరఖాస్తులను ఆన్‌లైన్ చేసినట్లు తెలిపారు.

### నేటితో పూర్తి చేయాలి

పెన్‌పహాడ్ : మండలంలో కొనసాగుతున్న ప్రజాపాలన దరఖాస్తుల డేటా ఎంట్రీని గురువారం ముగించాలని నియోజకవర్గ నోడల్ అధికారి సురేశ్ సిబ్బందికి సూచించారు. మండల కేంద్రంలోని తాసీల్దార్, మండల పరిషత్, ఉపాధి హామీ కార్యాలయాల్లో నిర్వహిస్తున్న ప్రజాపాలన డేటా ఎంట్రీ కార్యక్రమాన్ని బుధవారం ఆయన తనిఖీ చేసి సంబంధిత అధికారులతో మాట్లాడారు. డేటా ఎంట్రీ చేసేటప్పుడు ఆపరేటర్లు తప్పులు దొర్లకుండా చూసుకోవాలన్నారు. మండలంలో 14,007 దరఖాస్తులు రాగా ఇప్పటివరకు 12,400 ఆన్‌లైన్‌లో నమోదు చేసినట్లు ఎంపీడీఓ శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో డీటీ లాలూనాయక్, ఎంపీఓ నరేశ్, ఏపీఎం అజయ్‌నాయక్, ఏఓ కృష్ణసందీప్, ఏపీఓ రవి పాల్గొన్నారు.



పెన్‌పహాడ్‌లో డేటా ఎంట్రీ ప్రక్రియను పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి సురేశ్



జి.తిరుమలగిరిలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకట్రావు

## అంగన్‌వాడీ కేంద్రాలను పరిశుభ్రంగా ఉంచాలి

● కలెక్టర్ ఎస్.వెంకట్రావు

చివ్వెంల, నవంబర్ 10 : జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాలను పరిశుభ్రంగా ఉంచాలని, పిల్లల ఎత్తుకు తగిన బరువు ఉండేందుకు తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ ఎస్. వెంకట్రావు సూచించారు. బుధవారం మండలంలోని జి.తిరుమలగిరి అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి మాట్లాడారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను బోధించాలని సూచించారు. ప్రభుత్వం సరఫరా చేస్తున్న పౌష్టికాహార పదార్థాలను అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లోని పిల్లలకు అందించాలని అన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలను మండల స్థాయి అధికారులు నిత్యం పర్యవేక్షించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కేంద్రంలోని పిల్లల బరువును పరిశీలించారు. పిల్లలతో పాటలు పాడించి సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ లక్ష్మి, ఆయా అంజమ్మ పాల్గొన్నారు.

## ఉండ్రుగొండలో రుద్రాభిషేకం

చివ్వెంల, జనవరి 10 : మండలంలోని ఉండ్రుగొండ గుట్టల్లో గల ఉమా మహేశ్వర స్వామి ఆలయంలో బుధవారం మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాన్ని బ్రహ్మశ్రీ మనోహర శర్మ ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామి వారికి పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు. ప్రతి నెలా మాస శివరాత్రికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం శాస్త్రోక్తంగా జరిపిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



ఉండ్రుగొండ ఉమామహేశ్వర ఆలయంలో రుద్రాభిషేకం చేస్తున్న అర్చకులు

## విద్యార్థుల సామర్థ్యాల పెంపునకు కృషి చేయాలి : డీఈఓ



విద్యార్థుల నోటు పుస్తకాలను పరిశీలిస్తున్న డీఈఓ నారాయణరెడ్డి

మోత్కూరు, జనవరి 10 : ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల సామర్థ్యాల మెరుగుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని డీఈఓ నారాయణరెడ్డి అన్నారు. మున్సిపాలిటీ కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను బుధవారం ఆయన సందర్శించి విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. నోటు పుస్తకాలు, పాఠశాల రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ శ్రీధర్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రవీందర్‌రెడ్డి, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

## శ్రీకృష్ణుడి అలంకరణలో శ్రీనివాసుడు

● కొనసాగుతున్న ధనుర్మాసోత్సవాలు



గరిడేపల్లి : పొనుగోడు వేణుగోపాల స్వామి దేవాలయంలో పూజలు చేస్తున్న భక్తులు

బొడ్రాయిబజార్, జనవరి 10 : సూర్యాపేటలోని వేంకటేశ్వరస్వామి దేవాలయంలో జరుగుతున్న ధనుర్మాసోత్సవాల్లో భాగంగా 25వ రోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మండపంలో వేంకటేశ్వరస్వామిని శ్రీకృష్ణుడిగా అలంకరించారు. భక్తులంతా యశోదాదేవిగా, గోపికలుగా దుస్తులు ధరించి శ్రీకృష్ణుడి చిత్రపటాలతో తన్మయత్వంగా ఆడుతూ పాడుతూ అనుభూతి పొందారు. భక్తులంతా ఆలయంలో పెరుగును చిలికిన సన్నివేశం ఆకట్టుకుంది. అనంతరం ఆలయ అర్చకుడు వేణుగోపాలాచార్యులు భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. వికాస తరంగిణి, ఆండాళ్ గోష్టి భక్తబృందం పాల్గొన్నారు.

గరిడేపల్లి : మండలంలోని పొనుగోడులో గల రుక్మిణి, సత్యభామ సమేత వేణుగోపాల స్వామి, కల్మల్‌చెర్వులోని శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి దేవాలయాల్లో మంగళవారం 25 రోజు ధనుర్మాసోత్సవాలు కొనసాగాయి. ఈ సందర్భంగా మహిళలు పెద్ద సంఖ్యలో ఆయా దేవాలయాలకు వెళ్లి పూజలు చేశారు.

మేళ్లచెర్వు : ధనుర్మాస వేడుకల్లో భాగంగా స్థానిక వేంకటేశ్వర స్వామి ఆలయంలో బుధవారం స్వామివారికి వస్త్రాలంకరణ సేవ శాస్త్రోక్తంగా నిర్వహించారు. మండలంలోని వివిధ ఆలయాల్లో విష్ణు సహస్రనామ పారాయణం, అభిషేకాలు, కుంకుమార్చనలు, సప్తహారతులు జరిపించారు. ఆయా కార్యక్రమాల్లో అర్చకులు సుదర్శనం ప్రసాదాచార్యులు, మోహనకృష్ణ, భానుకిరణ్ శర్మ, వరప్రసాదాచార్యులు, శ్రీనివాసాచార్యులు, భక్తులు పాల్గొన్నారు.

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్‌లోని వేణుగోపాల సీతారామచంద్రస్వామి ఆలయంలో బుధవారం కోటి దీపోత్సవం, హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించారు. అనంతరం మహిళలు దీపాలను వెలిగించారు. కార్యక్రమంలో ఈఓ కొండారెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

## 17న సూర్యాపేట పాస్టర్స్ ఫెలోషిప్ నూతన కమిటీ ఎన్నిక

బొడ్రాయిబజార్, జనవరి 10 : సూర్యాపేట పట్టణ పాస్టర్స్ ఫెలోషిప్ కమిటీ రద్దు కాలేదని, ఈ నెల 17న నూతన కమిటీని ఎన్నుకోనున్నట్లు పాస్టర్స్ ఫెలోషిప్ జిల్లా గౌరవాధ్యక్షులు డాక్టర్ ప్రభుదాస్, పౌల్, జిల్లా అధ్యక్షుడు శ్రావణ్‌కుమార్, జిల్లా చైర్మన్ మామిడి శాంసన్, ఎన్నికల చైర్మన్ డాక్టర్ జాకబ్ అన్నారు. బుధవారం ఏర్పాటు చేసిన పాస్టర్స్ ఫెలోషిప్ సమావేశంలో వారు మాట్లాడారు. గత మూడేండ్లుగా సూర్యాపేట పట్టణ పాస్టర్స్ షెలోషిప్స్ కమిటీ కొనసాగుతుందని, పాత కమిటీ స్థానంలో కొత్త కమిటీ ఎన్నికకు కార్యాచరణ చేసినట్లు తెలిపారు. సమావేశంలో జోహర్ పౌల్, పాస్టర్స్ ఫెలోషిప్ పట్టణ అధ్యక్షుడు మీసాల ప్రభుదాస్, నియోజకవర్గ అధ్యక్షుడు గోవర్ధన్, రమేశ్ బాబు, శామ్యూల్‌కిరణ్, కరుణాకర్, డేవిడ్, లింగానాయక్, ముత్తయిలు పాల్గొన్నారు.

## అయోధ్య రామయ్య అక్షింతల పంపిణీ



సూర్యాపేట రూరల్ : ఇమాంపేటలో అక్షింతలు పంపిణీ చేస్తున్న భక్తులు

సూర్యాపేట రూరల్, జనవరి 10 : మండలంలోని ఇమాంపేటలో అయోధ్య రామయ్య అక్షింతలను బుధవారం ఇంటింటికీ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా భక్తులు శ్రీరామ నామస్మరణ చేస్తూ వీధుల్లో తిరిగి అయోధ్య రామయ్య విశిష్టతను వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ పాముల ఉపేందర్, వెంకట నర్సింహారెడ్డి, ఆంజనేయులు, బాలకృష్ణ, సాయిలు పాల్గొన్నారు.

గరిడేపల్లి : మండలంలోని కల్మల్‌చెర్వులో బుధవారం అయోధ్య రామయ్య అక్షింతలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మోతె : మండలంలోని విభళాపురంలో అక్షింతల పంపిణీ చేపట్టారు. కార్యక్రమంలో సర్పంచ్ ఏపూరి వీరస్వామి, నిమ్మల శేషగిరి, నాయిని వెంకన్న, మైనంపాటి శ్రీనివాస్‌రెడ్డి, మైనంపాటి ప్రభాకర్‌రెడ్డి, కుంభజడ వెంకటేశ్వర్లు, శ్రీకాంత్, నిమ్మల వీరయ్య, తిప్పలి శివ, భారతి పాల్గొన్నారు.



యువ సమ్మేళనంలో పాల్గొన్న విద్యార్థులు

## వివేకానంద బోధనలు ఆచరణీయం

● వివేకానంద ఉత్సవ సమితి అధ్యక్షుడు నాగార్జున

బొడ్రాయిబజార్, జనవరి 10 : విద్యార్థులు, యువకులు స్వామి వివేకానంద బోధనలు ఆచరించాలని వివేకానంద ఉత్సవ సమితి అధ్యక్షుడు అంగిరేకుల నాగార్జున అన్నారు. జాతీయ యువజన దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేసిన యువ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. భారతదేశం ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటి చెప్పి భారతమాతను విశ్వగురు పీఠంపై ప్రతిష్టింపజేసిన నవయుగ వైతాళికుడు స్వామి వివేకానంద అని పేర్కొన్నారు. ఆయన చూపిన బాటలో విద్యార్థులు నడిచి ఆయనకు నిజమైన వారసులుగా ఎదుగాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ నరసింహారావు, ఉత్సవ సమితి ప్రధాన కార్యదర్శి నాగవెల్లి ప్రభాకర్, పెండెం చంద్రశేఖర్, పర్వతం శ్రీధర్, గజ్జెల వెంకట్‌రెడ్డి, గట్ల సోమయ్య, నర్సయ్య, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## వర్ధాపురం ఉప సర్పంచ్‌పై నెగ్గిన అవిశ్వాసం



ఉప సర్పంచ్‌పై అవిశ్వాసానికి చేతులెత్తిన సర్పంచ్, వార్డు సభ్యులు

మఠంపల్లి, జనవరి 10 : మండలంలోని వర్ధాపురం ఉప సర్పంచ్ బత్తుల శంకరయ్యపై అవిశ్వాస తీర్మానం కోసం ఆర్డీఓ జగదీశ్వర్ రెడ్డి బుధవారం సమావేశం నిర్వహించారు. 8 మంది వార్డు సభ్యులకు గానూ ఐదుగురు వార్డు సభ్యులు, సర్పంచ్ బచ్చలకూరి అఖిల హాజరై ఉప సర్పంచ్‌పై అవిశ్వాసానికి తీర్మానించారు. మెజార్టీ సభ్యులు అవిశ్వాసానికి మద్దతుగా చేతులెత్తడంతో శంకరయ్య ఉప సర్పంచ్ పదవిని కోల్పోయినట్లు తెలిపారు. కార్యక్రమంలో తాసీల్దార్ మంగా రాథోడ్, ఎంపీఓ ఆంజనేయులు, కార్యదర్శి మహేశ్, సైదులు పాల్గొన్నారు.

## గీత కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి

మేళ్లచెర్వు, జనవరి 10 : మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి సహకారంతో గీత కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కౌండిన్య గౌడ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు కేఎల్ఎన్ ప్రసాద్ అన్నారు. మండలంలోని వెల్లటూరులో బుధవారం నిర్వహించిన గీత కార్మికుల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. లైసెన్స్ అవసరమైన వారికి వెంటనే మంజూరు చేయిస్తానన్నారు. నాగరాజు, శ్రీను, సైదులు, వెంకటేశ్వర్లు, రమేశ్, శ్రీను పాల్గొన్నారు.

## శాస్త్రోక్తంగా నృసింహుడి నిత్య కల్యాణం

మఠంపల్లి,జనవరి 10 : మండలంలోని మట్టపల్లి లక్ష్మీనరసింహ స్వామి క్షేత్రంలో స్వామివారి నిత్య కల్యాణాన్ని అర్చకులు బుధవారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి పంచామృతాలతో అభిషేకం చేసి వేదమంత్రోచ్చారణల నడుమ పట్టువస్త్రాలతో అలంకరించి కల్యాణతంతు జరిపించారు. అనంతరం ఆలయ పుర వీధుల్లో గరుడ వాహనంపై స్వామివారిని ఊరేగింపు చేశారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరి మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈఓ సిరికొండ నవీన్, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.



కల్యాణతంతు నిర్వహిస్తున్న అర్చకులు

## జాన్‌పహాడ్ దర్గా వద్ద కాంట్రాక్టర్ల దోపిడీ అరికట్టాలి

హుజూర్‌నగర్ , జనవరి 10 : జాన్‌పహాడ్ దర్గా వద్ద కాంట్రాక్టర్ల దోపిడీని అరికట్టాలని బహుజన్ సమాజ్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాపోలు నవీన్‌కుమార్ అన్నారు. బుధవారం ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డికి వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కొండమీది నర్సింహారావు, వట్టెపంగు సతీష్, సాయి, నర్సింహ పాల్గొన్నారు.

## దరఖాస్తులకు ఆహ్వానం

నడిగూడెం, జనవరి 10 : స్థానిక సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో 2024–25 విద్యా సంవత్సరానికి గానూ ఐదో తరగతిలో ప్రవేశానికి ఈ నెల 20లోపు విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ ధనవిజయలక్ష్మి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ.100 ఫీజు చెల్లించి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు పాఠశాల కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

## ఎరువుల దుకాణాల తనిఖీ

నేరేడుచర్ల, జనవరి 10 : ఎరువుల డీలర్లు రికార్డులు నిర్వహించకపోతే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఏడీఏ సంధ్యారాణి హెచ్చరించారు. బుధవారం నేరేడుచర్లలోని పలు ఎరువుల దుకాణాలను తనిఖీ చేసిన సందర్భంగా ఆమె మాట్లాడారు. రికార్డుల ప్రకారమే ప్రభుత్వం ఎరువులను సరఫరా చేస్తుందని తెలిపారు. హుజూర్‌నగర్ డివిజన్‌లో 1.39 లక్షల ఎకరాలకు గానూ వానకాలం 1.18 లక్షల ఎకరాల వరి సాగు చేశారని, యాసంగిలో 70 వేల ఎకరాలు మాత్రమే సాగవుతున్నందున ఎరువుల కొరత ఏ మాత్రం ఉండదని తెలిపారు. ఆమె వెంట ఏఓ జావిద్ ఉన్నారు.

## స్వపరిపాలన దినోత్సవం

నడిగూడెం, జనవరి 10 : మండల పరిధిలోని సిరిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. విద్యార్థులు ఒక్కరోజు ఉపాధ్యాయులు, అధికారులుగా వ్యవహరించి ఆకట్టుకున్నారు. తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు యలమర్తి శౌరి, ఉపాధ్యాయులు వేణుగోపాలరావు, మోతీలాల్, ఉమావతి, ప్రకాశ్‌రెడ్డి, అక్షపతి, మీర్జా షాకీర్‌బేగ్, నరసింహారావు, వెంకట్‌రెడ్డి, ఎస్ఎంసీ చైర్మన్ మల్లేశ్ పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి : ఎంపీపీ

ఆత్మకూర్.ఎస్, జనవరి 10 : గ్రామాలు, తండాల్లో సమస్యల పరిష్కారానికి అధికారులు, ప్రజా ప్రతినిధులు కృషి చేయాలని ఎంపీపీ మర్ల స్వర్ణలతా చంద్రారెడ్డి కోరారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మండల సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. మండల కేంద్రంలో ఓవర్ హెడ్ వాటర్ ట్యాంక్ నిర్మాణం పూర్తయి వాటర్ సరఫరా చేయడం లేదని ప్రజాప్రతినిధులు సభ దృష్టికి తీసుకొచ్చారు. ఉపాధి కూలీలకు లేబర్ కార్డును అందజేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మల్సూర్‌నాయక్, ఎంపీఓ సంజీవ, ఏఓ దివ్య, ఏఈలు బాబూరావు, రవికుమార్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

## ముగ్గుల పోటీలు

నడిగూడెం, జనవరి 10 : సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని స్థానిక సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో బుధవారం విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు వేసిన రంగువల్లులు ఆకట్టుకున్నాయి. అనంతరం విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రేణుక, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

గరిడేపల్లి, జనవరి 10 : విద్యార్థులు శ్రద్ధతో చదివి జీవితంలో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని మండల విద్యాధికారి చత్రూనాయక్ అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పనిచేసి బదిలీపై వెళ్లిన వెంకట్‌రెడ్డిని, ఇక్కడికి బదిలీపై వచ్చిన చతూనాయక్‌ను బుధవారం పాఠశాల విద్యార్థులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంకితభావంతో పని చేసిన ఉపాధ్యాయులకు సమాజంలో గుర్తింపు ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ కానుగు నగేశ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.